క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లు, నిందితునితో ఎస్ఐ, సిబ్బంది

కమలాపురం : సంబటూరు-కంచన్నగారిపల్లె మధ్యలో అక్రమంగా తరలిస్తున్న 151 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. మంగళవారం అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలసి సంబటూరు-కోగటం మధ్యలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కంచన్నగారిపల్లెకు చెందిన చిన్న సుబ్బిరెడ్డి, కోగటంకు చెందిన కొండారెడ్డిలు అక్రమంగా మద్యం తరలిస్తుండగా వారివద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం


మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

తొండూరు : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఆయుష్ శా, నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృతహస్తం సేవా సమితిల ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని అనే కార్యక్రమంపై మంగళవారం తొండూరులో విద్యార్థులచే పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయుష్ వైద్యులు డాక్టర్ నాగ మునినాయక్, ముక్తార్ అహమ్మద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సేవా సమితి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కుష్టు వ్యాధిపై సర్వే విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : కుష్టువ్యాధి ఇంటింటి సర్వే విజయవంతం చేయాలని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రదీప్, డీపీఎంఓ సుబ్బారెడ్డిలు తెలిపారు. మంగళవారం నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. ఈనెల 26వ తేదీ నుంచి జులై 16వ తేదీవరకు ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. అలాగే వ్యాధి ఉన్న వారిని గుర్తించి వారికి చికిత్సలు అందించాలన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించే విధానంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

వీరపునాయునిపల్లె : మండల వైద్యాధికారి వెంకటగిరిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి సిబ్బంది విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్టాఫ్ నర్స్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఆసుపత్రి పరిధిలో 71 మంది పనిచేస్తున్నామని అందులో 64 మంది మహిళా సిబ్బంది ఉన్నారని తెలిపారు. వైద్యాధికారి ఎవ్వరితో అసభ్యకరంగా ప్రవర్తించలేదని అమ్మ అని సంబోధించి మాట్లాడేవారని తెలిపారు. బదిలీల విషయంలో డాక్టర్‌కు ఎటువంటి సంబంధంలేదన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వల్లి ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు విచారణ చేపట్టారు. విచారణ జరిగిన విషయాన్ని ఎవరికి తెలియన్వివద్దని సిబ్బందికి చూసించినట్లు సమాచారం. దీని వెనుక ఉన్న ఆంతర్యమేమిటని పలువురు అంటున్నారు.

ప్రజల అవసరాలను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న శాంతమ్మ

చెన్నూరు : ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లను రామనపల్లె కార్యదర్శి ఎస్.శాంతమ్మ కోరారు. మంగళవారం ఆమె రామనపల్లెలోని సచివాలయంలో జగనన్న సురక్షపై సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 50 ఇళ్లకు సంబంధించి ప్రజలకు అవసరమయ్యే పనులను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దీపం స్వప్నిక, ఎంపీటీసీ సుంకర వెంకటసుబ్బమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్: చెన్నై నగరం రాయపేటలో 18వ తేదీన నిర్వహించిన రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో కమలాపురం పట్టణానికి చెందిన భగదీశ్వర్‌రెడ్డి చక్కటి ప్రతిభ కనబరిచాడు. అండర్-14 విభాగంలో పాల్గొని 9 రౌండ్లకు ఐదున్నరపాయింట్లు సాధించి 8వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ తెలిపారు.

త్వరగా సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : మండలంలో తాగునీటి, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు లేకుండా త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన కొండాపురం సచివాలయం-2 పరిధిలోని తాతయ్యగుట్ట, శివసాయి హైస్కూల్ వెనక భాగంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వివిధ సంక్షేమపథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేసిన లబ్ధిని తెలియజేస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక బరోసా ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోమారు దీవించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాలనీలో నీటిసౌకర్యం, డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు చింత రాజారెడ్డి, కొండు వాసుదేవారెడ్డి, నీలకంఠారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండు రామిరెడ్డి, రామంజల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, బుజ్జి, సాయి, చోటు, ఎంపీడీఓ నాగప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


సిమెంట్ రోడ్డుపనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : స్థానిక గ్రామపంచాయతీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన చెన్నూరులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. రూ.కోటితో సిమెంట్ రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే డ్రైనేజీ పనులు పూర్తి కాగా, కొత్త రోడ్డు మీద నుంచి వనం వీధి వరకు రూ.34 లక్షలతో 4 వందల మీటర్లు (డీఎంఎఫ్) డిస్ట్రిక్ జనరల్ ఫండ్ ద్వారా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. చెన్నూరు అరుంధతినగర్ వద్ద డ్రైనేజీ, రాజులకాలనీ నుంచి బెస్త కాలనీ వరకు డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి ఉచితంగా కులాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎసాసర్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్‌వీఆర్, సీనియర్ నాయకులు, జయభారత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం పనిచేయండి

డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్


మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్

పులివెందుల రూరల్ : లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డీఆర్డీఓ కార్యాలయంలో ఏపీఎంలు, సీసీలతో జగనన్న పాల వెల్లువపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని 164 గ్రామాల్లో పాల కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాడి రైతుల జీవనోపాధి పెంపుదల కోసం పాడి పశువులను కొనుగోలుకు పెద్ద ఎత్తున మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పాల కేంద్రాలలో పాల ఉత్పత్తి పెంపుదలకు ఈ ఆర్థిక సంవత్సరంలో మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించి పాల ఉత్పత్తులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, డీపీఎం మాల కొండయ్య, ఏపీడీడీసీ మేనేజర్ వెంకటేశ్వరమ్మ, ఏపీఎంలు, సీసీలు, డీఆర్డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పొలాల రహదారులకు మహర్దశ

- మట్టి రోడ్ల నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు
- డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి


వేల్పులలో మట్టిరోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని పొలాల రహదారులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నామని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేల్పుల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డితో కలిసి ఆయన ఉపాధిలో నిర్మించిన పొలాల రహదారులను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న మట్టి రోడ్ల నిర్మాణాలతో పొలాల రహదారులు సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణాలలో రాజీ పడవద్దని.. అత్యంత ప్రమాణాలు పాటిస్తూ మట్టి రోడ్లను వేస్తున్నట్లు తెలిపారు. గతంలో పొలాల రహదారులు కంపచెట్లు, రాళ్లతో నిండి రైతు పొలాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఉపాధిలో మట్టి రోడ్లను ఏర్పాటు చేస్తుండటంతో పొలాల వద్దకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వేల్పులలో ఏర్పాటు చేసిన పొలాల రహదారులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జిల్లాలో ఉపాధి పనులలో 45 లక్షల పని దినాలు పూర్తి చేశామన్నారు. ఇప్పటికే లక్ష్యాన్ని మించి కూలీలకు పని దినాలు కల్పించామన్నారు. అలాగే జిల్లాలో ఈ ఏడాది 5వేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకం చేపట్టడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అర్హులైన రైతులు అన్ని రకాల పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ గంగరాజు, ఈసీ శ్రీనివాసులరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

యోగ సాధనతో ప్రయోజనాలు

వైవీయూ : యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సన్నాహక శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం కళాశాలలో యోగ శిక్షణ నిర్వహించారు. యోగ గురువు ఆదినారాయణ ఆసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల్ నాగరాజు, డా. వై. సావిత్రి, డా. శివరామకృష్ణ, హాజరతయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

వైవీయూ : ఉద్యోగసాధనకు అవసరమయ్యే కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌లో పట్టుసాధించి ఉద్యోగసాధనలో ముందుండాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ సూచించారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉన్నతి ఫర్ నెక్ట్స్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో వర్క్‌షాపు నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నతి ఫౌండేషన్ ప్రతినిధులు కె. శ్రీనివాసులు, ఎన్. సుషిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

22న పురస్కారాలు ప్రదానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో 950 మార్కులు ఆపైన సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం 22వ తేదీన కడపలోని అపూర్వ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలను అందచేయనున్నట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే విద్యార్థులు వారి గుర్తింపుకార్డు, కాలేజీ ఐడికార్డు, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా తీసుకుని రావాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు తమ పేర్లను, 9248722218, 7780390139 నెంబర్‌లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. హాజరైన విద్యార్థులకు ప్రతిభ పురస్కారంతోపాటు సర్టిఫికెట్, నగదు బహుమతిని అందచేయనున్నట్లు వారు తెలిపారు.

రాయితీతో వ్యవసాయ పనిముట్ల పంపిణీ


మందు పంపులను అందజేస్తున్న సర్పంచ్ అనూరాధ

వీరపునాయునిపల్లె : జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు రాయితీతో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడం అభినందనీయమని పంచాయతీ సర్పంచు లింగారెడ్డి అనూరాధ అన్నారు. మంగళవారం బుసిరెడ్డిపల్లె గ్రామంలో ప్రాజెక్టు అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో ఆమె రైతులకు పైపులు, పవర్ స్ప్రేయర్‌లు, పట్టలు పంపిణీ చేసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన రైతులకు 90 శాతం, మిగిలిన కులాలకు చెందిన రైతులకు 80 శాతం రాయితీతో పనిముట్లను అందిస్తున్నారని ఇటువంటి గొప్ప కార్యక్రమం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రాజెక్టు అధికారి కళ్యాణి మాట్లాడుతూ ప్రస్తుతం 16 మంది రైతులకు పైపులు, 18 మంది రైతులకు మందు పంపులు అందజేశామని త్వరలో పట్టలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జేఈ రమదేవి, మద్దిలేటి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


కమలాపురం ఎస్సీ బాలికల హాస్టల్‌లో డీడీటీ పిచికారి చేస్తున్న సిబ్బంది

కమలాపురం : దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక అన్ని హాస్టళ్లలో దోమల నివారణ కోసం డీడీటీ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీడీటీ మందు 45 రోజుల వరకు పనిచేస్తుందని, దీనిని పిచికారి చేయడం వలన అనాలఫిస్ దోమలు మరణిస్తాయన్నారు. కిటికీలకు జాలీ వేసుకోవాలని, లేని పక్షంలో చీకటి పడగానే కిటికీలు, వాకిళ్లు మూసివేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే ఎలాంటి దోమలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ధనలక్ష్మీ, హాస్టల్ వార్డన్లు పాల్గొన్నారు.

కమలాపురం ఎంఈఓ 2గా జీవీ సుభాషిణి


సుభాషిణిని అభినందిస్తున్న ఎంఈఓ

కమలాపురం : మండల విద్యాశాఖాధికారి 2గా జీవీ సుభాషిణి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నూతనంగా ప్రతి మండలానికి ఎంఈఓ-2 పోస్టులను భర్తీ చేశారు. మంగళవారం నందిమండలం హెచ్ఎంగా పనిచేస్తున్న సుభాషిణి కమలాపురం 2వ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. కమలాపురం ఎంఈఓగా ఉన్న జాఫర్ సాదిక్ ఆమెను ఆహ్వానించారు. ఎంఈఓ-2గా బాధ్యతలు చేపట్టిన ఆమె మండల విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయరెడ్డి

వల్లూరు ఎంఈఓ 2గా విజయరెడ్డి

వల్లూరు : మండల విద్యాశాఖాధికారి 2గా విజయరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడప పట్టణంలోని కాగితాలపెంట జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఈయనను వల్లూరు కౌన్సిలింగ్‌లో అధికారులు ఎంఈఓ 2గా నియమించారు. ఆయన స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి లిల్లెమ్మ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె : డిగ్రీలో ప్రవేశం కొరకు 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు మంగళవారం తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవడానికి అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జులై 3వ తేదీన సీట్లు కేటాయించి 4వ తేదీ నుంచి తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 2020 నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి అన్ని డిగ్రీ కళాశాలలో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో మాదిరి డిగ్రీలో బీఎస్సీ, బీఏ, బీకాం సాంప్రదాయ కోర్సులు కాకుండా మేజర్ మరియు మైనర్ సబ్జెక్టులను కొనసాగించనున్నట్లు తెలిపారు. ఉదాహరణకు బీఎస్సీలో మ్యాథమెటిక్స్, బీఎస్సీలో ఫిజిక్స్, బీఏలో హిస్టరీ, బీకాంలో కంప్యూటర్స్ లాగా కొత్త విధానాన్ని ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక బీఎస్సీ హానర్స్ బీకాం హానర్స్, బీఏ హానర్స్‌లు కూడా కొనసాగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇతర వివరాలకు 9491947599, 9052311737, 8309321757 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైవీయూలో పీజీ తరగతులు ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పీజీ కళాశాలలో విద్యార్థులకు తరగతులు ఈనెల 19న ప్రారంభమయ్యాయని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు తరగతులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల కోసం వసతిగృహాలు సైతం అన్ని రకాల సౌకర్యాలతో సిద్ధంగా ఉంచామన్నారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులు విలువైన పాఠ్యాంశాలను నష్టపోతారని పేర్కొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

హౌసింగ్ పీడీ ఎం.కృష్ణయ్య


పక్కాగృహాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

లింగాల : మండలంలో మంజూరైన ప్రభుత్వ పక్కాగృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ ఎం.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని దొండ్లవాగు, అక్కులగారిపల్లె గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో వ్యక్తిగత పక్కాగృహాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. దొండ్లవాగు గ్రామంలో 67 పక్కాగృహాలు మంజూరయ్యాయని.. అందులో ర్యాండమ్‌గా పక్కాగృహాలను పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే అక్కులగారిపల్లెలో 41 పక్కాగృహాలు మంజూరు కాగా.. 10 పక్కాగృహాలను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మంజూరైన పక్కాగృహాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం పూరైన పక్కాగృహాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి, హౌసింగ్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఈకేవైసీ తప్పనిసరి


విద్యార్థుల ఈకేవైసీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

సింహాద్రిపురం : ప్రతి పేద విద్యార్థికి చదువు భారం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు కల్పిస్తోందని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు విద్యార్థులచే ఈకేవైసీ చేయిస్తున్న కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులతోపాటు అన్ని వస్తువులు కలిపి ఉన్న జగనన్న కిట్లు విద్యార్థులకు అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ అన్ని సచివాలయాల వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష పథకం ప్రారంభమవుతుందన్నారు.

కడప రాయునికి పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కడపరాయుడు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడప దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత శ్రీదేవి భూదేవి సమేత స్వామి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. కనుల పండువగా పూలు, సువర్ణ ఆభరణాలతో అలంకరించి పల్లకీపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. ఇరువైపులా చిద్విలాసమూర్తులైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాల మధ్య స్వామి తమ ఇళ్ల ముంగిటకే తరలి రావడంతో భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ కార్యదర్శులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో మంగళవారం బ్యాంకు శాఖల సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, బ్యాంకు కార్యదర్శులు వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ తారక్‌నాథ్ సేవలు మరువలేనివని.. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, టీబీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఐసీటీసీ, ఎస్‌టీఐ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్‌వల్లి, సేవా సమితి సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని పాటిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

జమ్మలమడుగు : అన్ని మతాలవారు సామరస్యాన్ని పాటించి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అర్బన్ సీఐ సదాశివయ్య తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక అర్బన్ స్టేషన్‌లో పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలతో ఆయన శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈనెల 29వ తేదిన బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకునేటందుకు అందరూ సహకరించాలన్నారు. ముస్లింలు బక్రీద్ సందర్భంగా చేసే ఖుర్బానీలో ఆవులను కాకుండా వైద్యులచే ధృవీకరించబడిన ఆరోగ్యకరమైన పొట్టేలను ఖుర్బానీ ఇచ్చేవిధంగా చేసుకోవాలన్నారు. ఏదైన సమస్యలు వచ్చినప్పుడు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణంలోని మత పెద్దలందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : దాల్మియా, భారత్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ భాగస్వామ్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటరుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దాల్మియా సీఎస్ఆర్ వి.రామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు మండల పరిధిలోని అంబవరం గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు కంప్యూటరు ఆధారిత సేవలు, ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు క్రీడా ఎంపికలు

కమలాపురం : స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశం కొరకు గురువారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ జాఫర్ సాదిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరు కావాలన్నారు. స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకై ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రము, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకుని రావాలన్నారు.